విశాలాంధ్ర విశాఖపట్నం
శనివారం 8, మార్చి, 2025
పేజి నెం. 5

కైలాసగిరి రోప్ వే సమీపంలో మంటలు

సందర్శించిన ఎంసీ, చర్యలకు ఆదేశం

విశాలాంధ్ర-విశాఖ : కైలాసగిరి రోప్ వే కేబుల్ కార్ సమీపంలో శుక్రవారం ఉదయం పారిశుద్ధ్య సిబ్బంది అక్కడ ఉన్న వ్యర్థాలకు నిప్పు పెట్టడం, పక్కనే ఉన్న రోప్ వే కేబుల్ కార్ కి చెందిన నిరుపయోగముగా ఉన్న టైర్లు, క్లీన్ చేసి పడేసిన ఆయిల్ క్లాత్ లు, ఫైబర్ వేస్ట్ కి మంటలు వ్యాపించాయని వీఎంఆర్డీఏ అధికారులు తెలిపారు. ఓపెన్ ప్లేస్ కావడం వల్ల పెద్దగా మంటలు వ్యాపించాయని, వెంటనే ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులకు తెలియజేయడంతో వారు వెంటనే సంఘటనా స్థలాన్ని చేరుకొని మంటలను ఆర్పివేశారని తెలిపారు. మెట్రోపాలిటన్ కమీషనర్ విశ్వనాథన్ అగ్నిమాపక అధికారితో కలసి సంఘటనా స్థలానికి చేరుకొని, అక్కడ ఉన్న పరిస్థితులను సమీక్షించారు. రోప్ వే యాజమాన్యంతో మాట్లాడుతూ బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొనవాలని ఆదేశించారు. అక్కడ ఉన్న మిగిలిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని ఆదేశించినారు. అనంతరం కైలాసగిరి పై ఉన్న దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేసి అగ్నిమాపక నియంత్రణ చర్యలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చేపట్టాలని, వాటికి సంబంధించిన సామాగ్రిని అందుబాటులో ఉంచాలని సూచించారు. తరచుగా ఫైర్ ఆడిట్ నిర్వచించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, అటవీ అధికారి శివానీ, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు పి4 సర్వే: కలెక్టర్ హరిందర్ ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 10 సూత్రాలు అనే గైడింగ్ ప్రిన్సిపల్ ని ప్రవేశ పెట్టడం జరిగిందని కలెక్టర్ హరిందర్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 10 సూత్రాలలో మొదటిది పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యం అన్నారు. పబ్లిక్, ప్రైవేట్ , ప్రజల భాగస్వామ్యంతో పి-4 సర్వే కు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు అదనంగా, సామాజికంగా ఆర్థికంగా పై స్థాయిలో ఉన్న కుటుంబాలు తమ సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న పేద కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా ప్రోత్సహించడం పి-4 సర్వే యొక్క ముఖ్య లక్ష్యం అన్నారు. ఈ సర్వే ఈ నెల 8 వ తేదీ నుండి 18 వ తేదీ వరకు గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా నిర్వహించడం జరుగుతుంది. పి-4 సర్వే లో ప్రయోజనం పొందడానికి అర్హత కలిగిన కుటుంబాలను గ్రామ,వార్డు సచివాలయాల వద్ద ఉన్న సమాచారం వుంటుందన్నారు. కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న సంక్షేమ మరియు ఇతర పథకాల పై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదు. కాబట్టి పేదరిక నిర్మూలనలో భాగంగా దిగువ స్థాయి కుటుంబాలను గుర్తించేందుకు ఇంటింటికి వచ్చే సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరుతున్నాం. అదేవిధంగా పేదరిక నిర్మూలన కొరకు మరియు ప్రభుత్వం చేపడుతున్న పి4 సర్వేకి సంబంధించి ప్రజల అభిప్రాయాలను మరియు సూచనలను నిర్దేశిత క్యూర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయవలసినదిగా కోరుతున్నామన్నారు.

గ్రామ వాలంటీర్లకు న్యాయం చేయాలి...

విశాఖ లో వాలంటీర్ల అఖిలపక్ష ధర్నా...

విశాలాంధ్ర-విశాఖ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాలంటీర్లకు న్యాయం చెయ్యాలని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని నాలుగు వాలంటీర్ల సంఘాలు ఐక్యంగా శుక్రవారం విశాఖపట్నంలో ధర్నాచౌక్ గాంధీ విగ్రహం దగ్గర అఖిలపక్ష దీక్షా కార్యక్రమం ప్రజా గ్రామ వార్డ్ వాలంటీర్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. గత ప్రభుత్వం 2.6 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి, వాలంటీర్స్ వ్యవస్థ తీసుకొని వచ్చి సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేర్చే విధంగా ఐదువేల వేతనంతో ఏర్పాటు చెయ్యడం జరిగిందని నేడు ప్రస్తుత ప్రభుత్వం అసలు ఆ వ్యవస్థే లేకుండా విచ్ఛిన్నం చెయ్యడం, మమ్మల్ని రోడ్డున పడేసిన తీరు సాటి మనిషి ఎవరికైనా బాధిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వాలంటీర్లను మభ్యపెట్టి నేడు అధికారం వచ్చాక మొహం చాటేసిందని ఏపీ ప్రజా గ్రామ వార్డ్ వాలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం

మాకు న్యాయం చెయ్యకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని మీరు ఇచ్చిన హామీలే కదా మేము అడిగేది మేము జీతం పెంచమని ఏరోజు అడగలేదు ఎన్నికల్లో భాగంగా మాయమాటలు నమ్మి మోసపోయాం మమ్మల్ని తక్షణమే విధుల్లోకి తీసుకొని మాట నిలబెట్టుకోవాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమాయూన్ భాష అన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు దండి ప్రియాంక మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు వాలంటీర్స్ పక్షాన నిలబడతామని దీక్షా శిబిరానికి వచ్చి వాలంటీర్లకు హామీ ఇచ్చారు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ కరోనతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే ప్రాణాలకు తెగించి ఇంటింటికి నిత్యవసర సరుకులు మందులు అందజేయడం, ముంపు గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయ వరుచుకుంటూ సేవలందించారు నేడు మిమ్మల్ని రోడ్డున పడేయడం భావ్యం కాదని వాలంటీర్లు వ్యవస్థపై అవగాహన లేకుండా నాడు మేనిఫెస్టోలో పెట్టి 10000 చేపిస్తామని నమ్మబలికి ఈరోజు ఓడ దాటక ముందు వాడమల్లన్న వాదదాటాక బోడి మల్లన్న అన్నట్టుగా ప్రభుత్వ వైఖరి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రామ వాలంటీర్ల సంఘం అధ్యక్షులు కొమ్ము రాంబాబు అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్ల సంఘం సలహాదారు ఈదర గోపి చంద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.ఎస్.జే అచ్యుతరావు అల్లూరి జిల్లా వాలంటీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము సురేష్ బాబు, జిల్లా నాయకులు ప్రసాద్ కొండమ్మ, అలాగే రాష్ట్ర నాయకులు రాజేష్,జగదీష్, వాసు, వెంకట సుబ్బయ్య,ప్రజా గ్రామ వార్డ్ వాలంటీర్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా నాయకులు కోడూరు లక్ష్మణ్,రాము, చంద్రశేఖర్, శ్యాంకుమార్,మనోహర్, శ్రీనివాస్, అమ్మోరు, పార్వతి,రాజు, అజార్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలి

ఏఐటీయూసీ ధర్నా

విశాలాంధ్ర-విశాఖ: జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ అనుబంధ సంఘాలకు చెందిన వాల్తేరు రైల్వే డివిజన్ కాంట్రాక్టు కార్మికులు, హిందూజా పవర్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు, విశాఖపట్నం కాంట్రాక్టు కార్మికులు, శ్రావణి షిప్పింగ్ కళాసీలు, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతన బోర్డును నియమించాలని, కాంట్రాక్టు కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని, ఈ ఎస్ ఐ, పి ఎఫ్, గ్రాట్యూటీ, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు, సింక్ లీవ్, ఈఎల్, క్యాజువల్ లీవు వంటి సౌకర్యాలు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేసి కార్మిక వర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలను అమలు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ విధానాలను రద్దుచేసి పరిశ్రమల్లో పర్మినెంట్ ఉద్యోగులుగా పరిణిగించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా నాయకత్వంలో ధర్నా జరిగింది. ఈ ధర్నా శిబిరాన్ని కామ్రేడ్ జీఎస్జె అచ్యుతరావు ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో ఎఐటియుసి విశాఖ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బూసి వెంకటరావు, అధ్యక్షులు ఎం. మన్మధరావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సంయుక్త కార్యదర్శులు పి చంద్రశేఖర్, కసిరెడ్డి సత్యనారాయణ, పదాల గోవిందు ,జిల్లా సమితి సభ్యులు కానుబాబు, ఎన్.నాగభూషణం, కె అచ్యుతరావు, గురుమూర్తి పాల్గొన్నారు.

మధురవాడ 5వవార్డులో రూ.4కోట్లతో అభివృద్ధి పనులు

శంకుస్థాపన చేసిన గంటా

కృతజ్ఞతలు తెల్పిన కార్పొరేటర్

విశాలాంధ్ర-మధురవాద: జీవీఎంసీ (మధురవాడ) జోన్-2, 5వ వార్డు పరిదేశిపాలెంలో ప్రారంభించి ఆ వార్డు పరిధిలో రూ:4కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేసిన భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఈ సందర్భంగా కొమ్మాది జంక్షన్ వికలాంగుల కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీటీ, సిసి రోడ్లు, డ్రైనేజ్లు తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు తో పాటు పారిశుద్ధ్యం మెరుగుపరుస్తున్నామని, వీటి ఏర్పాట్లలో నూ నిర్వహణ లో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం కార్పొరేటర్ మొల్లి హేమలత మాట్లాడుతూ.. తమ వార్డులో మౌలిక వసతుల కల్పనకు సహకరించిన గౌరవ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపి, ఈ సహకారం తమ వార్డు అభివృద్ధికి నిరంతరం అందిచాలని కోరారు. ఈ కార్యక్రమాలలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు,రాష్ట్ర టిడిపి నాయకులు పిల్లా వెంకట్రావు, టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాంద్రాశి అప్పలరాజు, బోయి శ్రీను,భీమిలి నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, ఆవార్డును టిడిపి, జనసేన అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ, దేవర శివల తోపాబుఈగల రవికుమార్, బోయ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పనిభారంతో తలమునకలు

- పై స్థాయి అధికారులకు చెప్పుకోలేని వైనం..
- నలిగిపోతున్న ఉద్యోగులు...
- అన్ని పనులకు కార్యదర్శులే ఆధారం..
- పని భారం కుదించాలని ఉద్యోగుల ఆవేదన...
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మా బాధలు ఆలపించండి
- కార్యదర్శులు కన్నీటి వ్యధ...
- పని భారం తగ్గించాలని పలువురు సూచన...

విశాలాంధ్ర-ఆనందపురం : ప్రస్తుతం రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి రోజురోజుకి ఆగమ్యగోచరంగా తయారైంది. తరచు ఉద్యోగులపై పని భారం పెరగడంతో పంచాయితీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. సర్వేలు చేయడానికి కార్యదర్శులు ప్రధానఆధారం. తీరిక లేక మానసికంగా నలిగిపోతున్న ఉద్యోగులు. ప్రస్తుత విధానంలో మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్, హౌస్ హోల్డ్స్ జియో ప్యాకింగ్,పి4 సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, పిఎసిఎస్ సర్వే, లెథర్ ఆర్టిసన్స్ సర్వే, ఎన్పీసీఎల్ లింకేజ్ సర్వే, 0-6 సంవత్సరాల పిల్లల మిస్సింగ్ ఆధార్ సర్వే, నాన్ ఏపీరెసిడెంట్స్ సర్వే, విలేజ్ అసిస్టెంట్స్, విలేజ్ ప్రొఫైల్ సర్వే, ఇంటిపన్నుల వసూళ్లు, కుళాయి పన్నుల వసూళ్లు, లైసెన్స్ లు వసూళ్లు, లీజ్ వసూళ్లు, వేలం పాటలు, ఇతర పన్నేతర వసూళ్లు, పి ఆర్ వన్ యాప్ శానిటేషన్ డ్రైవ్ ఎస్ డబ్ల్యు పిసి షెడ్ క్లాప్ మిత్రులతో పని చేయించడం, వర్మీ తయారీ, ప్రతి గురువారం సేల్స్, ట్యాంక్ క్లీనింగ్, క్లోరిఫికేషన్, ఐ వి ఆర్ ఎస్ కాల్స్ భయం, ప్రతి మూడవశనివారం స్వర్ణంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమా లు, యాడ్వర్స్ న్యూస్ కి ప్రతిస్పందన, స్వర్ణ పంచాయతీలో చలానా నమోదు, పిఆర్ఎ జిపిడిపీ, గ్రామ పంచాయతీలో నీటి సమస్యలు, గ్రామ పంచాయతీ , గ్రామసభ సమావేశాలు జరుపుట, గ్రామ పంచాయతీ రికార్డుల అప్డేషన్, వివిధ సర్టిఫికెట్స్ జారీ, సిబ్బంది జీతాలు, ఆర్టిఐలు, పిజి ఆర్ ఎస్ లు, సమీక్ష సమావేశాలు, ఆడిట్, ప్రొఫార్మాలు, గూగుల్ షీట్స్, మైక్ అనౌన్స్మెంట్స్, బ్యానర్స్, వెబ్ఎక్స్ లు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు మహిళా పోలీసులతో, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో డిజిటల్ అసిస్టెంట్ లతో పంచాయతీ కార్యదర్శులు పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే రీ సర్వేల వల్ల వీఆర్వో లకు, సర్వేర్ లకు ఎమర్జెన్సీ మెడికల్ సర్వే వల్ల ఏఎన్ఎంలకు, ల్యాండ్ రిజిస్ట్రేషన్ ల వల్ల అగ్రికల్చర్ అసిస్టెంట్ లకు పని భారం పెరగడంతో వీరికి మినహాయింపు ఉంది. అంతేకాకుండా సచివాలయ సిబ్బందితో సమన్వయం, అధికారుల విజిట్లు, పాలకవర్గంతో , ఇవి కాక ప్రతి పంచాయతీ లోనూ ఎన్నో చిన్నా, పెద్ద సమస్యలు ఉన్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు పని భారంతో సతమతమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై నూతన వరవడిని తీసుకొచ్చినప్పటికీ అన్ని రకాలుగా పంచాయతీ కార్యదర్శులపై రోజురోజుకి తీవ్రమైన పనిభారం దానికి తోడు అధికారులు తరచు ఒత్తిడికి గురవుతున్నారు. అలాగే పని ముగించుకుని ఇంటికి బయలుదేరి సమయానికి వీడియో కాన్ఫరెన్స్ లు, మీటింగ్ లు తప్పనిసరిగా హాజరు కాకపోతే మెమోలు జారీ చేస్తారని, ఆదేశాలు ఉండటంతో అర్ధరాత్రి అయినా సరే మీటింగులకు హాజరు అవ్వాల్సిన పరిస్థితి అటు కుటుంబానికి పిల్లలకి సరైన సమయాన్ని కేటాయించలేక మనోవ్యాధనకు గురవుతో పై అధికారులకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తీసుకొని ,పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు దృష్ట్యా కొంతవరకు పని భారం తగ్గించినట్లయితే కార్యదర్శులు ఇంకా చురుగ్గా పనిచేయడానికి, ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా ఆలోచిస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ లను మర్యాద పూర్వకంగా కలసిన ఇంచార్జ్ ఈఓ

విశాలాంధ్ర-గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి నూతన ఇంచార్జ్ కార్య నిర్వహణాధికారి కె సుబ్బారావు విశాఖ ఎం.పి భరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు లను వినయ పూర్వకంగా కలిశారు. వీరికి స్వామివారి శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. వారితో రానున్న వార్షిక తిరుకల్యాణ మహోత్సవం, చందనయాత్ర ల ఏర్పాట్లపై కాసేపు ముచ్చటించారు. వీరితో దేవస్థానం సహాయ కార్య నిర్వహణ అధికారి ఎన్ ఆనంద్ కుమార్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో శానిటైజేషన్ వేగవంతం చేయండి

గొట్టిపల్లి లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పర్యటన

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీలో శుక్రవారం ఉదయం కలెక్టర్ హరింధిర ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో జరుగుతున్న రీ సర్వే గురించి మండల సర్వేయిర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వే పనితీరు ఎంతవరకు వచ్చింది ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడి సర్వేలో ఏమైనాలోపాలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడి గ్రామాల్లో శానిటైజషన్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ తో పాటు మండల తాసిల్దార్ పేర్ల శ్యాం ప్రసాద్, సర్వేర్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ కొండలరావు, మండల సర్వే యిర్ అప్పన్న, విఆర్ఓ సుమలత, రైతులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిజాయితీగా సంక్షేమ పథకాలు అమలుచేసిన ప్రజా నాయకుడు జగన్మోహన్‌రెడ్డి

వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్ మజ్జి చిన్న శ్రీను

విశాలాంధ్ర-కొమ్మాది : నిజాయితీగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ప్రజా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని వైయస్ఆర్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్ మజ్జి చిన్న శ్రీను, మధురవాడ వైసిపి సీనియర్ నాయకులు పోతిన శ్రీను అన్నారు. శుక్రవారం రమ్య పారడైస్ కల్యాణ మండపం లో వైయస్సార్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పోతిన శ్రీను మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఎద్దేవా చేశారు. భీమిలి నియోజకవర్గ ఇన్చార్జిగా మజ్జి చిన్న శ్రీను ప్రకటించినందుకు సంతోషంగా ఉందన్నారు. భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్. చిన్న శ్రీను మాట్లాడుతూ తనను నియోజకవర్గ పార్టీ ఇన్ఛార్జిగా నిర్మించిన జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భీమిలి నియోజకవర్గం కార్యకర్తలకు అండగా ఉండాలని జిల్లా పరిషత్ చైర్మన్ గానే కాక జిల్లా పార్టీ అధ్యక్షులుగా రెండు బాధ్యతలు నెరవేరుస్తూనే భీమిలి నియోజవర్గ బాధ్య తలు తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యకర్తలకి నా సహాయ సహ కారాలు ఎప్పుడూ ఉంటా యని అన్నారు. ప్రజల కు ఎక్కువగా సంక్షేమ కార్య క్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు సాగించాలంటే వైసీపీకే సాధ్యమవుతుందని, అవన్నీ క్షేత్రస్థాయిలో పోరాటం ద్వారానే సాధ్యం అవుతుందని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు లీడర్స్ భారీ ఎత్తులో పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ లో మహిళా దినోత్సవ వేడుకలు...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : : మహిళలు అన్ని రంగాలలో అగ్రపధాన నిలుస్తున్నారని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రసంశించారు. మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు తమ దైనందిన జీవితంలో గృహిణిగా, ఉద్యోగినిగా విభిన్న పాత్రలు నిర్వర్తిస్తూ అటు ఇంటిని, ఇటు సంస్థను అగ్రపథంలో నిలుపుతున్నారని ప్రసంశించారు. సివిల్ సర్వీసెస్ తో పాటు పోటీ పరీక్షలన్నింటిలోనూ మహిళలే అగ్రభాగాన నిలుస్తూ ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్నారన్నారు. సంస్థ లోని ఆఫీస్ అసిస్టెంట్ లలో కొంత మంది మహిళలను జెఎల్ఎం ట్రైనింగ్ కి కూడా పంపడం జరిగిందని, సంస్థ చేపట్టే తదుపరి రిక్రూ ట్మెంట్ లో మహిళలకు కూడా అవకాశం ఇవ్వడం జరుగుతుందని హామీ ఇచ్చారు. మహిళలు ఎల్లప్పుడూ మానసికంగానే కాకుండా శారీరకంగా, ఆరోగ్యం గా ఉండాలని, అందుకు మంచి ఆహార పద్ధతులు పాటించడం చాలా అవసరమని సూచించారు. సంస్థలో మహిళా ఉద్యోగినుల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంస్థలో అగ్రభాగాన నిలిచిన ఆపరేషన్స్ డైరెక్టర్ వి.విజయలలిత, సీజీఎం లు డి.సుమన్ కళ్యాణి, బి.సులేఖరాణి, జీఎం లు ఎన్.పార్వతి, ఎం.విజయచాముండి, పి.శ్రీదేవి లను సీఎండీ, డైరెక్టర్లు సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.చంద్రం, బి.రామచంద్రప్రసాద్, వి.విజయలలిత, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వి.రామకృష్ణప్రసాద్, చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమన్ కళ్యాణి, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, అచ్చి రవికుమార్, పాల్గొన్నారు.

14న సింహగిరిశుని పెళ్లిచూపులు

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారు పెళ్ళిచూపులకు బయలు దేరేందుకు అయ్యవారు తమ పల్లకిని దేవాలయ అర్చక స్వాములు, అధికారులకు ఏర్పాట్లు చేయమని ఈఓ కె సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. 14న స్వామివారు తొలి పొద్దు నిత్యం జరిగే పూజలన్ని జరిపించుకుని సర్వాంగ సుందరంగ ముస్తాబై మెట్ల మార్గం వెంబడి కొండ క్రిందకు చేరుకుని పెళ్ళి చూపులు నిమిత్తం తమ సోదరి, అడవివరం గ్రామదేవత అయిన పైడితల్లమ్మ ఇంటికి (ఆలయానికి) పల్లకిలో వెళ్తారు. పెరుమాళ్ళు తమ సోదరి ఇంటివద్దకు చేరుకొని ని కూతుర్ని తనకిచ్చి వివాహం చేయమని అర్చక స్వాములు స్వామివారి తరపున అడుగుతారు. అందుకు స్వామివారి సోదరి అంగీకరించదు. అయ్యవారు సోదరిపై అలిగి తన ఉద్యానవనం (పూలతోట) కు చేరుకొని కోపం తగ్గిగాక తిరిగి సోదరి దగ్గరకు వెళ్ళి నీ కుమార్తె తో వివాహం జరిపిస్తావా లేదా అని మొండిపట్టుపట్టగానే, చేసేదేమీ లేక పైడితల్లమ్మ సరే అని నాకూతుర్ని నీకిచ్చి వివాహం చేస్తాను అని అమ్మవారు సమ్మతిస్తుంది. అందుకు అయ్యవారు అనందం పట్టలేక ఎగిరి గంతు లేసి తమ పరివారంతో కలసి చుర్ణోత్సవం (రంగుల హోలీ) చల్లుకుంటూ పుష్కరిణి సత్రంకు చేరుకుంటారు. అనంతరం అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేయించి పెరుమాళ్ళకు పెళ్లి పనులు మొదలుపెట్టేందుకు అధికారులతో మంతనాలు జరుపుతారు. అనంతరం అయ్యవారికి పానంకం ఆరగింపు పెట్టి తరువాత అయ్యోర్లు భక్తులకు పానకం పంచిపెడతారు. స్వామివారు కొండక్రింద తిరు వీధిలో ఊరేగుతూ భక్తులందరికీ మాపెళ్ళి నిశ్చయమైంది అంతా మా వివాహ వేడుకలను తిలకించేందుకు తవరలోనే ఆహ్వానం పంపుతాం అని హుకుం జారిచేస్తారు. భక్తులు పరవసంతో అయ్యవారికి ఎవరిక వారు తోచిన విదంగా నైవేద్యాలు సమర్పించి అందరికి ఆ నైవేద్యం పంచి పెడతారు. తిరువీధి అనంతరం మెట్లమార్గం వెంబడి కొండపైన తమ మందిరానికి చేరుకుంటారు. ఈనెల 30 ఉదుపు రాట, ఏప్రిల్ 8న రథోత్సవం, వార్షిక తిరు కళ్యాణ మహోత్సవం, 30న చందనోత్సవం (నిజరూప దర్శనం).

శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామికి చక్ర స్నానం

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 94 వ వార్డు పరిధి రవి నగర్ శేషాద్రి కొండపై కొలువైయున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి 25వ వార్షికోత్సవ వేడుకలు ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మం, పంచామృత అభిషేకం, నిర్వహించారు. మహా పూర్ణాహుతి, దేవత ఉద్వాసనం, చక్ర స్నానం ధ్వజ అవరోహణం కార్యక్రమాలను వేద పండితులు జరిపించారు. వారం రోజులపాటు సాగిన వేడుకల్లో వేలాదిమంది భక్తులు కళ్యాణ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కమ్యూనికేషన్ రంగంలో విస్తృత అవకాశాలు

గీతంలో దూరదర్శన్ మాజీ అధికారి

విశాలాంధ్ర-మధురవాద: టెలీ కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఇంజనీరింగ్ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించనున్నాయని ముఖ్యంగా సాంకేతిక ప్రగతిలో స్వదేశీ పరిజ్ఞానం కీలక పాత్ర పోషించనున్నదని దూరదర్శన్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎమ్.వి.డాక్టర్ డి.రంగనాథమ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇఇసిఇ విభాగం, బ్రాడ్కాస్ట్ ఇంజనీరింగ్ సొసైటి (ఇండియా) హైదరాబాద్ ఛాప్టర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న "ఛేంజింగ్ ఫేస్ ఆఫ్ బ్రాడ్కాస్ట్ టెక్నాలజీ" వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 3జి, 4జి అవసరాల కోసం విదేశాలపై ఆధారపడిన స్థాయి నుంచి స్వదేశీ పరిజ్ఞానంతో 5జి టెక్నాలజీని విజయ వంతంగా అభివృద్ధి చేసిన ఘనత భారతీయ పరిశోధకులదేనని, ప్రస్తుతం రాబోయే రోజులలో 6జి టెక్నాలజీని సహితం దేశ ప్రజలకు అందించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. టెలికామ్ రంగంలో వస్తున్న ఈ విప్లవం రానున్న రోజులలో 25 లక్షల ఉద్యోగాలను సృష్టించనున్నదని అందుకు తగ్గట్లుగా విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ బ్రాడ్కాస్ట్ ఇంజనీరింగ్‌లో వస్తున్న మార్పులను యువత నిశితంగా గమనించాలని పరిశోధనల పై దృష్టి సారించాలని సూచించారు. కృత్రిమ మేధ వంటివి సాంకేతికంగా మార్పులు తీసుకువస్తున్నాయని వాటిని విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాడ్కాస్ట్ ఇంజనీరింగ్ సొసైటి (ఇండియా) నిపుణులు సభ్యులు ఎల్.శ్రీపతిరావు, డాక్టర్ వి.రామారావు, డాక్టర్ ఎన్.నమశ్శివాయ, బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఇఇసిఇ విభాగం సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ కె.కరుణకుమారి, బి.రవికిరణ్, సిఎస్ఇ విభాగం సీనియర్ ప్రొఫెసర్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఔషధ పరిశోధనలలో సవాళ్ళను ధీటుగా ఎదుర్కోవాలి

గీతం ప్రొ. వైస్ ఛాన్సలర్ గౌతమరావు

విశాలాంధ్ర-మధురవాడ: కోవిడ్ తదనంతరం ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త ఆరోగ్య సంబంధ సమస్యలు ఎదురవుతున్న నేపద్యంలో వైద్య రంగం సవాళ్ళను ఎదుర్కొంటోందని వీటిని ఔషధ పరిశోధనల ద్వారా ధీటుగా ఎదుర్కోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫార్మశీ రంగంలో నూతన పోకడలు అనే జాతీయ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా హజరై ప్రారంభించారు. ఔషధ రంగంలో భారత దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని ముఖ్యంగా లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల ప్రజలకు భారతీయ ఔషధాలు ఆధారం అన్నారు. ఔషధాల తయారీలో పరిశోధన నుంచి ఉత్పాదన మరియు మార్కెటింగ్ వరకు కాలానుగుణంగా మారుతున్న సాంకేతికతను ఉపయోగించుకుని ఫలితాలు సాధించాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్ మాట్లాడుతూ ఔషధ పరిశోధన జరిగాక అవి పరిశ్రమలలో ఉత్పత్తి చేసి ప్రజలకు అందడానికి దాదాపు 10 సంవత్సరాల సమయం, భారీగా నిధులు అవసరం పడుతున్నాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ వంటివి ఉపయోగించుకుని త్వరతగతిన ఔషధాలను మార్కెట్‌లోకి తీసుకురావలసి ఉందన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజి (హైదరాబాద్) డైరక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మానవాళికి అవసరమైన ఔషధాలను అన్వేషించడంలో స్టీరియో కెమిస్ట్రీ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. ఒక మందు బయటకు రావాలంటే దాదాపు 5వేల మాలిక్యూల్స్‌ను పరిశోధించి ఔషధ గుణాలను వెలికి తీయాల్సి వస్తోందన్నారు. కృత్రిమ మేధ ద్వారా ఈ సమయాన్ని తగ్గించడం పై యువ

పరిశోధకులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఓ) అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ కె.భువనేశ్వరి మాట్లాడుతూ దేశంలో దాదాపు 10 వేల ఔషధ ఉత్పత్తి పరిశ్రమలు ఉన్నాయని, ఔషధాల ఎగుమతిలో భారత దేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉందన్నారు. ఔషధాల నాణ్యత ప్రమాణాలు పరీక్షించడంతో పాటు ఎగుమతులు, దిగుమతులకు అనుమతులను సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పర్యవేక్షిస్తుందన్నారు. 1940 డ్రగ్స్ కాస్మెటిక్స్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్, ఆర్జిన్ అంకాలజి లిమిటెడ్ సీనియర్ డైరక్టర్ డాక్టర్ ఎన్.కవిత, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి (బరంపూర్) సహయ ప్రొఫెసర్ డాక్టర్ వివేక్ తివారి, గీతం బయోకెమిస్ట్రి ప్రొఫెసర్ మళ్ళరామారావు, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ పార్థారాయ్ పాల్గొని ప్రసంగించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి ఫార్మశీ విద్యార్థులు, పరిశోధకులు హజరయ్యారు.

మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-ఆనందపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రిసోర్స్ పర్సన్ తో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సభ్యులు పిల్లలకు ఆటలు ఆడించి,మరియు మహిళల హక్కుల కోసం తెలియజేశారు. ఇందుకు ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ మీసాల సత్యనారాయణ ఎంపీటీసీ రామదేవి రెడ్డి బాబు , కేజీబీవీ స్కూల్ టీచర్ రాణి సచివాలయం సిబ్బంది మహిళా పోలీస్ దేవి ప్రియాంక , జై జవాన్ ఫౌండేషన్ కౌశాదికరి కుప్ప రామలక్ష్మి మ్యాజిక్ బస్సు ట్రైనింగ్ కం మోనిటరింగ్ ఆఫీసర్ దూడ.రమేష్ , మ్యాజిక్ బస్ యూత్ మెంటర్స్ రవణమ్మ ,మాది బోయిన సాయి కుమారి, గుడివాడ దుర్గ, తాటిపూడి రమ్య, మహిళలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి చీరలు పంపిణీ

విశాలాంధ్ర-పెందుర్తి : అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళా శానిటేషన్ సిబ్బందికి ప్రోత్సాహకరంగా 35 మంది మహిళలకు జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు దంపతులు చీరలు పంపిణీ చేశారు. జీవీఎంసీ 97 వార్డు టిడిపి కార్యాలయంలో మహిళ సిబ్బందిని సత్కరించి వారు సమాజానికి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సమాజం అభివృద్ధిలో మహిళలు పాత్ర చాలా విలువైనదని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 97 వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ , శానిటేషన్ సిబ్బంది, డ్వాక్రా ఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమం

విశాలాంధ్ర-పద్మనాభం: పద్మనాభం మండలం లో మండల కార్యాలయ ప్రాంగణంలో పలు కార్యాలయాలలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం లో స్థానిక ఎంపీపీ రాంబాబు,తాసిల్దార్ కే ఆనందరావు, ఎంపీడీవో విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా మండలంలోని వివిధ శాఖలలో వివిధ హెూదాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళలందరకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు తో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని ప్రతి రంగంలో కూడా మహిళలందరూ తమ సత్తాను నిరూపించుకుంటున్నారని వారికి ప్రతి చోట అవకాశం కల్పించాలని ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని ప్రతి ఆడబిడ్డను బాగా చదివించి వాళ్ల కాళ్ళ మీద వాళ్లు నిలబడినట్లయితే ఆ కుటుంబం ఏప్పుడు సంతోషంగా ఉంటుందని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు కలిగినప్పుడే మహిళలను మనం గౌరవించిన వారం అవుతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సర్పంచులకు, మహిళా ఎంపీటీసీలకు, వివిధ శాఖలలో బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళా అధికారులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటి కళాశాలలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-ఆనందపురం: సొంట్యాం ఎస్ఎస్ ఆర్ ఐ టి ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగం గా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గౌరవ ముఖ్య అతిధి గా విచ్చేసిన చోడవరం సబ్-రిజిస్ట్రార్, బి. గీత లక్ష్మి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్య ను అభ్యసిస్తున్న విద్యార్థినులకు కేవలం ఇంజనీరింగ్ కంపెనీ లలో నే కాకుండా ప్రభుత్వ రంగాలలో మహిళలకు ఎన్నో అవకాశాలు వున్నాయని దానిద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు., విద్యార్థినులు అన్ని రంగాలలో స్థానాలు సాధించి తమ ప్రతిభా పాటవాలను చాటాలని ఉద్ఘటించారు. వివిధ అంశాలపై మహిళలకు సూచనలు ఇచ్చారు. ముఖ్య అతిధిని కళాశాల యాజమాన్యం సత్కరించింది., ఈ కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్. ప్రసాద రాజు , ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శంభు ప్రసాద్, సిఎంఓ డాక్టర్ పి.ఎస్. రాజు హాజరై వుమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి. ఉష రాణి, కో -కోఆర్డినేటర్ డాక్టర్.వి. బాల ఇతర ఫాకల్టీ కోఆర్డినేటర్స్, మహిళా అధ్యాపకులను సత్కరించారు.

మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-పద్మనాభం: మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఈ రోజు మజ్జిపేట లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రిసోర్స్ పర్సన్ తో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, మ్యాజిక్ బస్ ఆటలు ఆడించి, మహిళల ను గౌరవించాలని, మహిళలను అన్ని రంగాలలో ముందుకు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని, మరియు మహిళలు యొక్క హక్కుల కోసం తెలియజేయడం జరిగింది. ఇందుకుగాను ముఖ్య అతిథులుగా మజ్జిపేట స్కూల్ ప్రధానోపాధ్యాయులు స్కూల్ స్టాఫ్ సచివాలయం మహిళా పోలీస్ గారు, అంగన్వాడి టీచర్, స్కూల్ ఎస్ ఎమ్ సి చైర్మన్ మ్యాజిక్ బస్ ట్రైనర్, సౌజన్య ట్రైనింగ్ కం మోనిటరింగ్ ఆఫీసర్ దూడ. రమేష్ మ్యాజిక్ బస్సు యూత్ మెంటార్స్ దుర్గా, రమ్య, సాయి కుమారి, రవణమ్మ మరియు మహిళలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

అమృత కళాశాలలో ట్రాఫిక్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పెందుర్తి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెందుర్తిలో గల అమృత విద్య సంస్థలలో శుక్రవారం ఉదయం అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ జి శ్రీనివాసరావు, ఎస్సై నర్సింగ రాజులు ట్రాఫిక్ నియమాలను విద్యార్థులకు వివరించారు. నిబంధనలు పాటించకపోవడం ద్వారా కలుగు నష్టాలు, చట్టపరమైన శిక్షలను వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాఫిక్ నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తున్నాయని వీటిని ధిక్కరిస్తే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా పడే అవకాశం ఉందని తెలియజేశారు. రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం . రెండవ శనివారం సెలవు దినం కావడంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గంభీరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులు భారతదేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న మహిళల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, హ్యూమన్ కంప్యూటర్ శకుంతల దేవి, ఒలింపిక్స్ లో బాక్సింగ్ లో కాంస్యం సంపాదించిన మేరీ కోమ్, స్పేస్ లోకి వెళ్లిన మొదటి మహిళ కల్పనా చావ్లా, కూచిపూడి భరతనాట్యంలో గొప్ప కళాకారిణి యామిని కృష్ణమూర్తి మొదలైన వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాలలో సహోపాధ్యాయిని వరలక్ష్మికి, ఇతర మహిళ సిబ్బందికి సన్మానించడం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ " ఎక్కడ స్త్రీ గౌరవించబడుతుందో అక్కడ దేవతలు నివసిస్తారని, మహిళ దినోత్సవం ఇప్పటిది కాదని 1908 వ సంవత్సరంలో అమెరికాలో ప్రారంభం అయిందని, 1975 లో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవం అధికారికంగా నిర్వహించింది. మహిళలను గౌరవించడం ప్రతి పురుషుని బాధ్యత" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ నిరుద్యోగ యువతకు శుభవార్త!

ఉపాధి వ్యాపారం కోసం దరఖాస్తుకు 10 నుంచి ఓబిఎంఎంఎస్ పోర్టల్ అందుబాటులోకి



విశాలాంధ్ర-పెందుర్తి: రాష్ట్రంలోని బ్రాహ్మణ నిరుద్యోగ యువతీ, యువకులకు శుభవార్త.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేయటానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య విశాఖజిల్లా అధ్యక్షులు వద్దాది ఉదయకుమార్ శుక్రవారం మీడియాకు తెలియజేశారు. బ్రాహ్మణ సామాజిక వర్గంలోని నిరుద్యోగ యువతియువకులతో పాటు అర్చక, పురోహితులు కూడా బీఎంఎంఎస్‌పోర్టల్ ద్వారా ఈనెల 10వ తేదీ నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ బడే ఈ పోర్టల్ ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.ఈ పోర్టల్ లో తమ పేరు నమోదు చేసుకున్న తర్వాతఅభ్యర్థులు నివాసముండే ప్రాంతాలవారీగా వారి దరఖాస్తులను విడదీసి సంబంధిత మండల, మున్సిపల్ అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు.ఈ దరఖాస్తులను అధికారులు దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలు వారు చేసే వ్యాపార తదితర అంశాలను పరిశీలించి సంబంధిత బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుకు సిఫార్సు చేస్తారన్నారు. ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని ఉదయకుమార్ తెలియజేశారు. అందుచేత నిరుద్యోగ యువతీ యువకులు తప్పనిసరిగాఈఅవకాశాన్నివినియోగించుకోవాలని కోరారు ఈ దరఖాస్తులు చేసే విధానం, పూర్తి వివరాలకు చినముషిడివాడ సుజాతనగర్ లోగలసమాఖ్యకార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన సూచించారు.ఈనెల 10వ తేదీ నుంచి ఈ పోర్టల్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. బ్రాహ్మణుల సదవకాశంగా భావించాలని ప్రతి ఒక్కరు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికిఇదివేదికగా ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా దరఖాస్తు చేసుకోవాలనుకున్న అభ్యర్థులు "ఈడబ్ల్యూఎస్" సర్టిఫికెట్ కూడా సిద్ధం చేసుకోవాలని కోరారు.అవసరమైతే ఆ సర్టిఫికెట్ కూడా దరఖాస్తుతో జత చేయాల్సి ఉంటుందన్నారు.ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.పూర్తి వివరాల కోసం 8008129309 ఫోన్ నెంబర్ ని సంప్రదించవచ్చని,వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయవచ్చని ఉదయకుమార్ తెలియజేశారు.

సాయి సంహిత ట్రస్ట్‌ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళా ఉపాధ్యాయులను, మహిళలను శాలువాలతో సన్మానించిన ట్రస్ట్ సభ్యులు

విశాలాంధ్ర-తగరపువలస : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సాయి సంహిత ట్రస్ట్ వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి అప్పలరాజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కొన్ని పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులను, మహిళలను 40 మందిని తన సాయి సంహిత ట్రస్ట్ ద్వారా శాలువాలతో సత్కరించారు. స్వీట్లు, పండ్లు ఇచ్చి మహిళల పట్ల తమ ట్రస్ట్ కున్న అభిమానాన్ని చాటుకున్నారు. దేశచరిత్ర నిర్మాణంలో మహిళల పాత్ర అజరామరమని మహిళలు లేని ప్రపంచాన్ని ఊహించలేమని, వారి సేవలు అమోఘమని, కొలవలేమని, ఏమిచ్చినా ఎంత చేసినా వారి రుణం తీర్చుకోలేనిదని తెలియజేశారు. ఆపదలో ఉన్న ఎవరికైనా సరే తమ సంస్థ ద్వారా సహాయం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.తమ భార్యాభర్తల నెల జీతం లో కొంత సామాజిక సేవకై వినియోగిస్తున్నామని తెలిపారు. వీరందరినీ గౌరవించి, సత్కరించే అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సాయి సంహిత ట్రస్ట్ మహిళా అధ్యక్షురాలు మద్దిరెడ్డి సంతోషి కుమారి మాట్లాడుతూ మార్చి 8 మహిళలకు అంకితమైన రోజని ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్స వంగా జరుపుకుంటారని మహిళలు దేనిలోనూ తక్కువ కాదంటూ లింగ సమానత్వాన్ని తెలియజేస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలు వేడుకలను జరుపుకుంటారని మానవజాతి మనుగడకు ప్రాణం పోసే మహిళ ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం అన్నింటా సగం అంటూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలు సాధిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక, ఒకటవ వార్డు జి వి యం సి ప్రాథమిక బంగ్లామెట్ట మహిళా ఉపాధ్యాయులు బుగత మల్లిక, ఈగల సంజీవి, అదేవిధంగా డా. బి. ఆర్. అంబేద్కర్ జి.వి.యం.సి ఉన్నత పాఠశాల, చిట్టివలస మహిళా ఉపాధ్యాయులు సత్యలక్ష్మి, రాధా, భవాని ఇతర మహిళా ఉపాధ్యాయులు, జి.వి.యం.సి ఉన్నత పాఠశాల రాయపాలెం ప్రధానోపాధ్యాయురాలు రాధా కుమారి, శైలజ, ప్రమీల అదేవిధంగా మరికొంతమంది మహిళలను శాలువాలతో, స్వీట్లు, పండ్లులతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చిన్నమనాయుడు, జగదీష్, ఆర్.శ్రీనివాసరావు, జగ్గు బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కార్మికుల తొలగింపునకు వ్యతిరేకంగా ఆందోళన

మానవహారం నిర్వహించిన అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మికులు

విశాలాంధ్ర-పెదగంట్యాడ : అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మికులంతా మేనేజ్మెంటు చేస్తున్న అక్రమ కార్మికుల తొలగింపుపై బిసి గేట్ వద్ద ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీ కృష్ణ ఆధ్వర్యం లో మానవహారం నిర్వహించారు. రాత్రికి రాత్రే 270 మంది కార్మికులను ఆన్లైన్ లో తొలగించడాన్ని తప్పుపట్టారు. లేబర్ కమీషనర్ దగ్గర ఒప్పందం ప్రకారం మేనేజ్మెంటు, కాంట్రాక్టర్లు, కాంట్రాక్ట్ కార్మిక నాయకులు ఈ నెల11 వరకు ఎటువంటి చర్యలు తీసుకోకూడదని నిర్ణయం చేసి, వచ్చిన తరువాత అక్రమంగా మేనేజ్మెంటు ప్రవర్తిస్తూ కార్మికులను తొలగిస్తుంది. ప్రశ్నించే నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. గతం లో 4000 మందిని అర్ధాంతరంగా తొలగించినప్పుడు గవర్నమెంట్ చొరవ తీసుకొని కపట ప్రేమ చూపిస్తూ అందరినీ పెట్టుకోవడం జరిగింది. ఈ రోజు వాళ్ళ అందరినీ మళ్లీ తొలగించే ప్రయత్నం మేనేజ్మెంటు చేస్తుంది. ప్రభుత్వం చొరవ తీసుకొని ఆపుతున్న కార్మికుల అందరినీ మళ్లీ తిరిగి విధుల్లోకి చిత్త శుద్ధితో తీసుకోవాలి. మరియు ఏ ఒక్కరిని తొలగించిన అఖిల పక్షాలు అన్నీ కలిసి నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉన్నాయి. 11 వ క్లోజింగ్ జరుగుతున్న చర్చల్లో ప్రభుత్వం మేనేజ్మెంటు సానుకూలంగా స్పందించాలని తెలియ జేస్తున్నాయి. అఖిల పక్ష నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, ఉరుకూటి అప్పారావు, పితాని భాస్కర్ రావు, దేవర అప్పారావు, శ్రీనివాస్, భాస్కర్‌రావు, గురునాథ్ రెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.

మహిళా చట్టాల అవగాహన, అమలు కీలకం

విశాలాంధ్ర-మధురవాడ: మహిళలను సంరక్షించేందుకు ఎన్ని చట్టాలు ఉన్నా వాటి పట్ల అవగాహన, వాటిని అమలు జరిపే విధానం కీలకం అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.విజయ లక్ష్మి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హజరయ్యారు. భారత రాజ్యంగం చట్టం ముందు సమానమే అని చెప్పడంతో పాటు సమాన అవకాశాలను కల్పించాలని పేర్కొంటుందని అలాగే సమాన విద్య, ఉపాది, అవకాశాలను కల్పించాల్సి ఉంటుందన్నారు. వీటిని పరిరక్షించుకోవడంతో పాటు న్యాయం కోసం బాధితుల తరుపున పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. దేశంలోని కార్పోరేట్ రంగంలో న్యాయకత్వ స్థానాలలో కేవలం 15 శాతం మంది మాత్రమే మహిళలు ఉంటున్నారని వారిని మరింతగా ప్రోత్సహించాల్సిన బాధ్యత సంస్థలపై ఉందన్నారు. దేశంలో స్టార్టప్‌లను నెలకొల్పిన వారిలో 18 శాతం మంది మహిళలు ఉండటం ఆహ్వానించతగ్గ పరిణామం అన్నారు. నేటి తరం ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పది మందికి ఉపాధి కల్పించే ఔత్సహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. ఎలాంటి అవరోధాలు ఎదురైనా ధైర్యంగా తట్టుకుని ఎదురు నిలబడి విజయం సాధించాలన్నారు. గీతం అధ్యక్షుడు, విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ మహిళలు మానసికంగా బలమైన పోరాట దృక్పదాన్ని కలిగి ఉండాలని అప్పుడే ప్రతి అడుగులోను విజయం సాధించ వచ్చునన్నారు. లింగ వివక్షత భారతీయ సమాజంలో ఇంకా ఉనికిని చాటుకుంటోందని దీన్ని మార్చాల్సిన బాధ్యత నేటి తరం పై ఉందన్నారు. ప్రతిభ కనబరచడం ద్వారా మహిళలు నాయకత్వ స్థానాలను చేరుకోవాని తద్వారా సమాజంలో మార్పు సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డిసోజా, జిమ్‌సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం మహిళాసాధికారిక అధ్యక్షురాలు డాక్టర్ వి.బి.శ్రీవిద్యా, కన్వీనర్ సుధారాజగోపాలన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.విజయ లక్ష్మిని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ సన్మానించారు.

జీవీఎంసీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలి
జీవీఎంసీ యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం.సత్యవేణి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మహిళలు అన్ని రంగాలలో పురోగతి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలని జీవీఎంసీ యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం.సత్యవేణి పేర్కొన్నారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ సర్వీసెస్ (జెమ్స్) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ మహిళా అధికారులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు అన్ని రంగాలలో పురోగతి సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు. జీవీఎంసీలో మహిళా దినోత్సవం ఏర్పాటు చేసిన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ సర్వీసెస్ (జెమ్స్) వెల్ఫేర్ అసోసియేషన్ (%+జుమీ%) సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మహిళలు ఎంతో ఆర్థికంగా ఎదిగినా ఇంకా వారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. మహిళలలో చిన్నప్పటి నుంచే మనోధైర్యాన్ని నింపాలన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యుదయానికి ఎన్నో కార్యక్రమాలు చేసిందని, ఆదాయము లక్ష రూపాయలు కన్నా తక్కువ ఉన్న కుటుంబాలను లక్షకు పైగా ఆదాయం వచ్చే మార్గాన్ని వారికి చూపిస్తుందని తెలిపారు. మహిళలు ఇటు ఉద్యోగం తో పాటు ఇంటిని చక్కదిద్దే పనిని కూడా చేస్తారని వారి సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, అన్ని రంగాల్లో పురోగతిని సాధిస్తూ, ఆర్థికంగా బలపడి, మనోధైర్యంతో, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని తెలుపుతూ అందుకు నేడు భారతదేశ ఆర్థిక శాఖ మంత్రి ఒక మహిళ అని గుర్తు చేశారు. తదుపరి భీమిలి జోనల్ కమిషనర్ పి.ప్రసన్నవాణి మాట్లాడుతూ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె మహిళగా తన విద్యాభ్యాసాన్ని ఉద్యోగ నిర్వహణలో అనుభవాల్ని పంచుకున్నారు. అన్ని రంగాలలో మహిళలు పురోగతి సాధించాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం జెమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగంతో పాటు ఉద్యమాలలో, సామాజిక ,సంక్షేమ కార్యక్రమాల్లో కూడా మహిళలు అధికంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళలు అధికంగా పాల్గొనే ఉద్యమాలు అన్ని పురోగతిని సాధించాయని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ జెమ్స్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులందరికీ జేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం సత్యవేణి ని, ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబను, జోనల్ కమిషనర్ ప్రసన్నవానిని జీవీఎంసీ మహిళా అధికారులు, ఉద్యోగులు దుశ్శాలువులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్ ఈ ఎస్ ఏ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుబ్బలక్ష్మి, విశాఖ ప్రధాన కార్యదర్శి ఇ.అప్పలరాజు, జెమ్స్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రవి, ట్రెజరర్ వి.సన్యాసిరావు, వై.మూర్తి, వి.నారాయణరావు లతోపాటు జీవీఎంసీ మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

10 నుంచి ఓబిఎంఎంఎస్ పోర్టల్ అందుబాటులోకి ..

బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షులు వద్దాది ఉదయకుమార్.

విశాలాంధ్ర-పెందుర్తి : రాష్ట్రంలోని బ్రాహ్మణ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేయటానికి ప్రత్యేక పోర్టల్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షులు వద్దాది ఉదయకుమార్ శుక్రవారం తెలియజేశారు. బ్రాహ్మణ సామాజిక వర్గంలోని నిరుద్యోగ యువతి యువకులతో పాటు అర్చక, పురోహితులు కూడా ఓబిఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈనెల 10 నుంచి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలియజేశారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ పోర్టల్ ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ పోర్టల్ లో పేరు నమోదు చేసుకున్న తర్వాత అభ్యర్థులు నివాసముండే ప్రాంతాలవారీగా దరఖాస్తులను విడదీసి సంబంధిత మండల, మున్సిపల్ అధికారులకు పంపిస్తారని తెలిపారు. దరఖాస్తుదారుల అర్హతలు వారు చేసే వ్యాపారం, తదితర అంశాలను పరిశీలించి సంబంధిత బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరుకు అధికారులు సిఫార్సు చేస్తారన్నారు. ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని ఉదయకుమార్ తెలియజేశారు. నిరుద్యోగ యువతీ యువకులు తప్పనిసరిగా ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసే విధానం, పూర్తి వివరాలకు చినముషిడివాడ సుజాతనగర్ లో గల సమాఖ్యకార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు "ఈడబ్ల్యూఎస్" సర్టిఫికెట్ కూడా సిద్ధం చేసుకోవాలని, దరఖాస్తుతో దాన్ని జత చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం 8008129309 ఫోన్ నెంబర్ ని సంప్రదించవచ్చని,వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయవచ్చని ఉదయకుమార్ తెలియజేశారు.

జెడ్ పీ లో ఘనంగా మహిళా దినోత్సవం





విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: జిల్లా ప్రజా పరిషత్, విశాఖపట్నం ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్లోని అన్ని శాఖల మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగినులకు ఆట పాటలు నిర్వహించి బహుమతుల ప్రధానం చేశారు . కార్యక్రమం ప్రారంభంలో ఏపీపిఆర్ఎంఈఏ అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు, చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ లింగ సమానత్వం , మహిళా సాధికారత యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. రాబోయే నెలల్లో మహిళా విద్య, వైద్యం, ఆర్థిక సాధికారతపై దృష్టి సారించిన కొత్త కార్యక్రమాలను జిల్లా పరిషత్ అమలు చేస్తుందని ప్రకటించారు. .జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి. నారాయణమూర్తి మహిళా ఉద్యోగులు నిరంతరం సేవా కార్యక్రమాలు, సృజనాత్మకత, ప్రజాసంక్షేమం పట్ల చూపిస్తున్న అంకితభావాన్ని ప్రశంసించారు. పెందుర్తి జడ్.పి.టి.సి. సభ్యురాలు ఉప్పిలి దేవి, ఏపీపిఆర్ఎంఈఏ అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు, ఉప కార్యనిర్వాహణాధికారి రాజ్ కుమార్ ఆనందపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జానకి పాల్గొన్నారు.